క్లుప్తంగా

మహిళల ఆరోగ్యంపై అవగాహన


ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

సూళ్లూరుపేట: మున్సిపాలిటీ పరిధిలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ప్రపంచ రుతుస్రావ దినోత్సవం సందర్భంగా ఆదివారం మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా డాక్టర్ ఉత్పల, మహిళలకు రుతుస్రావం, గైనకాలజీలో ఉన్న ఆరోగ్య సమస్యల పట్ల అవగాహన కల్పించారు. మెప్మా సీఓలు నారాయణమ్మ, హనుమాయి, పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు స్వప్న, ఆర్పీలు, ఏఎన్ఎంలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరానికి స్పందన



ఆయుర్వేద వైద్యశిబిరం ప్రారంభోత్సవం

సూళ్లూరుపేట: లయన్స్‌క్లబ్ ఆఫ్ సూళ్లూరుపేట, షార్ ఆధ్వర్యంలో తులసి ఆయుర్వేదిక్ ఆస్పత్రి సహకారంతో ఆదివారం ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. బస్టాండ్ సమీపంలోని బాలికల జిల్లాపరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని బీజేపీ సూళ్లూరుపేట నియోజకవర్గ కన్వీనర్ తాటిపర్తి ఆదినారాయణరెడ్డి ప్రారంభించారు. ఆయుర్వేద డాక్టర్లు శివప్రసాద్, డాక్టర్ సాయిప్రియ వైద్యసేవలు అందించారు. ఈ శిబిరంలో 200 మంది వైద్య పరీక్షలు చేసుకున్నారు. అనంతరం వైద్యులను లయన్స్ క్లబ్ సభ్యులు సత్కరించారు. క్యాంప్ చైర్మన్ టి.సుదర్శనరావు, లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కామిరెడ్డి ఆదిశేషారెడ్డి, దువ్వూరు సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

జేసీబీ స్వాధీనం

సైదాపురం: మండలంలోని పెరుమాళ్లపాడు–తలుపూరు రెవెన్యూ అటవీ సమీపంలో ఖనిజ సంపదను రాత్రి పూట తవ్వకాలను జరుపుతున్నట్లు సమాచారం అందుకున్న గ్రామ తలారులు శనివారం రాత్రి పరిశీలించారు. ఈక్రమంలో ఖనిజ సంపద కోసం తవ్వకాలు సాగిస్తున్న జేసీబీని తలారీ ఈవిషయమై ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందజేశారు. అలాగే చాగణంరాజు పాళెం–చాగణం సమీపంలో రాత్రి పూట విపరీతంగా ఖనిజ సంపద కోసం తవ్వకాలను సాగిస్తున్నారు. పెద్ద పెద్ద టిప్పర్లు నిత్యం తిరుగుతున్నా కూడా అటవీశాఖ అధికారులు పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

పెంచలకోనలో వర్షం


పెంచలకోనలో కురుస్తున్న వర్షం

రాపూరు: పెంచలకోనలో ఆదివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండవేడికి, ఉక్కపోతకు అల్లాడిన ప్రజలు వర్షం కురవడంతో కొంత మేర ఉపశమనం పొందారు. బ్రహ్మోత్సవాలకు ముందు, ముగిసిన అనంతరం పెంచలకోన క్షేత్రంలో వర్షం కురవడం ఆనవాయతీ అని భక్తులు అంటున్నారు.

కోలాహలంగా నాగార్పమ్మకు పొంగళ్లు


ప్రత్యేక అలంకరణలో నాగార్పమ్మ

ఓజిలి: ఓజిలి గ్రామదేవత నాగార్పమ్మకు భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి పొంగళ్లు పెట్టారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు చేసి పొంగళ్లు పెట్టారు. అమ్మవారిని పూలతో సుందరంగా అలంకరించి పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. భక్తులు అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. నాగార్పమ్మ మూడు రోజుల జాతర ప్రశాంతంగా ముగిసింది.

కండలేరులో 30.704 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం 30.704 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 2,450 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 110, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 80, లోలెవల్ స్లూయిజ్‌కు180, హైలెవల్ స్లూయిజ్‌కు 30క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు ఆయన వివరించారు.

జగనన్న కానుక సిద్ధం

- మండల వనరుల కేంద్రాలకు చేరిన విద్యా కానుక పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్
- జూన్ 10కి పాఠశాలలకు చేరేలా ఏర్పాట్లు


దక్కిలి ఏపీ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో భద్రపరిచిన పాఠ్యపుస్తకాలు

దక్కిలి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏటా అందిస్తున్న జగనన్న విద్యా కానుక కిట్లు పాఠశాలలు తెరవడానికి ముందే మండల విద్యా వనరుల కేంద్రాలకు చేరాయి. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ పేద విద్యార్థి పాఠశాలకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం అన్ని రకాల విద్యా సామగ్రిని విద్యార్థులకు అందిస్తుంది. గత ప్రభుత్వాలు కేవలం పాఠ్య పుస్తకాలు మాత్రమే ఇచ్చేవి. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు స్కూల్‌బ్యాగ్, షూస్, సాక్స్, నోట్‌బుక్స్, బెల్టు వంటి వాటిని జగనన్న విద్యాకానుక కిట్ పేరుతో అందిస్తున్నారు. 2023–24 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సరిపడా విద్యా కానుక కిట్లు ఇప్పటికే మండల విద్యా వనరుల కేంద్రానికి చేరాయి. జూన్ 10వ తేదీ నాటికి మండలంలో ఆయా పాఠశాలలకు కిట్లను తరలించడానికి విద్యాశాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఏయే పాఠశాలలకు ఎన్నెన్ని పంపించాలో తరగతులు వారిగా ఆయా పాఠశాలల విద్యార్థుల సంఖ్యను బట్టి మండల కేంద్రాల్లో కిట్లు సిద్ధం చేస్తున్నారు.

నియోజకవర్గంలో ఉన్న పాఠశాలలు...

వెంకటగిరి నియోజకవర్గంలో డక్కిలి, బాలాయపల్లి, వెంకటగిరి పట్టణం, వెంకటగిరిరూరల్, సైదాపురం, రాపూరు, కలువాయి మండలాల్లో ప్రభుత్వ పాఠశాలలు 472 ఉన్నాయి. వాటిలో ఒకటి నుంచి 10వ తరగతి వరకు 26,734 మంది విద్యార్థులు ఉన్నారు. వారందరికీ జగనన్న విద్యా కిట్లను అందించనున్నారు.

జగనన్న కిట్లలో సామగ్రి..

ప్రతి జగనన్న విద్యా కానుక కిట్‌లోనూ ఒక స్కూల్ బ్యాగ్, ఒక బెల్టు, ఒక జత షూస్, రెండు జతల సాక్స్, మూడు జతల యూనిఫాం, మూడు సెట్ల నోట్ పుస్తకాలు(ఒకసెట్టులో ఆరు నోటు పుస్తకాలు ఉంటాయి), ఒక సెట్ పాఠ్యపుస్తకాలు ఉంటాయి. దీంతో విద్యార్థి విద్యా సంవత్సరం పొడవునా నోట్ పుస్తకాలు గానీ పాఠ్యపుస్తకాలు కానీ కొనే పని ఉండదు. ఆ మేరకు విద్యార్థులకు ఆర్థిక భారం తగ్గుతుంది.

పెరిగిన విద్యార్థుల సంఖ్య..

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల సంఖ్య ఏడాది ఏడాదికి పెరుగుతోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు సంఖ్య వెంకటగిరి నియోజకవర్గంలోని డక్కిలి, బాలాయపల్లి, రాపూరు, సైదాపురం, వెంకటగిరి రూరల్, కలువాయి మండలాల్లో గతేడాది 24,892 మంది ఉంటే ఈ ఏడాది 26,734కు పెరిగింది. వచ్చే నెలలో పాఠశాల ప్రారంభమయ్యే సమయానికి మరింత పెరగవచ్చునని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

నియోజకవర్గంలోని మండలాల వారీగా ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల సంఖ్య..

మండలం	ప్రాథమిక పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
డక్కిలి	73	3,770
బాలాయపల్లి	69	3,070
రాపూరు	76	4,830
సైదాపురం	88	3,944
వెంకటగిరి	98	7,011
కలువాయి	68	4,109


సిద్ధంగా ఉన్న నోట్‌బుక్స్



జగనన్న విద్యా కానుక కిట్

అంతా సిద్ధం చేస్తున్నాం..



ఈ ఏడాది విద్యాసంవత్సరంలో మండలంలోని విద్యార్థులు అందరికీ సరిపడా జగనన్న విద్యా కానుక కిట్లు ఇప్పటికే వచ్చాయి. ఈ ఏడాది ముందుగానే ప్రభుత్వం వాటిని సిద్ధం చేసింది. జూన్ 12న పాఠశాలలు తెరుస్తారు. జూన్10వ తేదీ నాటికి అంటే రెండు రోజులు ముందుగానే అన్ని పాఠశాలలకు కిట్లు తరలించేందుకు ఏర్పాట్లు చేశాం. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు సకాలంలో విద్యార్థులకు అందిస్తాం.

– కె.వెంకటేశ్వర్లు, ఎంఈఓ, డక్కిలి

గాంధీ పార్కులో పూర్తిస్థాయి వసతులు


పార్కులో వసతులను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

నాయుడుపేటటౌన్: ప్రజల ఆటవిడుపుతో పాటు ప్రతి ఒక్కరిని ఆహ్లాదం కలిగించేలా ఏర్పాటు చేసిన గాంధీ పార్కులో పూర్తిస్థాయిలో వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాపరావు వెల్లడించారు. ఆదివారం పార్కును కమిషనర్ పరిశీలించారు. గాంధీ పార్కును అధునాతనంగా తీర్చిదిద్ది పిల్లలతో పాటు పెద్దలు, యువకులు, మహిళలు అందరికి ఆహ్లాదం కలిగించేలా వివిధ క్రీడా పరికరాలు, వాకింగ్ ట్రాక్ వసతులను సైతం ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇటీవల పార్కులో విద్యుద్దీపాలంకరణ చేసి రాత్రి 8 గంటల వరకు కూడా ప్రజలు పార్కులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఇంకా చిన్న పిల్లల కోసం జారుడు బల్లలు, వర్షం వస్తే ప్రజలు తడవకుండా షెల్టర్, వాచ్‌బాయ్ గది నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. వాటిని త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులో తీసుకొస్తామని తెలిపారు. బైనా మల్లికార్జున రెడ్డితో కలిసి కమిషనర్ పరిశీలన చేశారు.

ఉపాధి పనులపై గ్రామసభ

చిల్లకూరు: మండల తీర ప్రాంతంలోని లింగవరం గ్రామంలో ఆదివారం ఉపాధి పనులపై గ్రామసభ నిర్వహించారు. గ్రామ సచివాలయంలో సర్పంచ్ ఎన్ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన గ్రామసభలో గత ఏడాది ఉపాధి ద్వారా గ్రామంలో చేపట్టిన పనులపై విచారణ చేపట్టారు. గ్రామసభలో గత ఏడాది చేపట్టిన రూ.17.59 లక్షలతో పనులు పూర్తి చేశారని ఈ పనులు చేపట్టిన సమయంలో కూలీలకు నగదు చెల్లింపులు సక్రమంగా జరిగాయా, ఏవైనా అసంపూర్తి పనులు ఉన్నాయా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే చిల్లకూరు పంచాయతీలో జరిగిన ఉపాధి పనులకు సంబంధించి గ్రామసభను నిర్వహించి అక్కడ ఎంతమేర నిధులు వినియోగించారనే విషయాలను ఆరా తీశారు. టీఏ జయచంద్ర, డీఆర్పీ నరేష్, క్షేత్ర సహాయకులు సంధ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

తీరంలో ప్రాణ భయం

- ఆరు నెలల్లో నలుగురు మృతి
- పల్లెవాసులతో కన్నె పూజలు


బంగారమ్మ మాను వద్ద పూజా సామగ్రి

చిల్లకూరు: వివిధ కారణాలతో గ్రామంలో ఆరు నెలల్లో నలుగురు మరణించడంతో గ్రామస్తులు గ్రామానికి ఏదో కీడు సంభవించిందని భావించి భయం, భయంగా గడుపుతున్నారు. దీనిని ఆసరా చేసుకున్న ఓ క్షుద్ర మాంత్రికుడు గ్రామస్తులకు మాయ మాటలు చెప్పి వారం రోజులుగా పూజలు నిర్వహించిన విషయం ఆలస్యంగా ఆదివారం వెలుగుచూసింది. సముద్ర తీరానికి కిమీ దూరంలో ఉండే తీగపాళెం గ్రామంలో 20 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఈక్రమంలో ఆరు నెలల్లో ఓ వృద్ధురాలు అనారోగ్యంతో మృతిచెందగా, తరువాత మరొకరు చనిపోయారు. ఆ తరువాత నెల క్రితం ఓ యువకుడు విద్యుత్ షాక్‌తో మృతిచెందగా మరో యువతి ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో గ్రామస్తుల భయాన్ని ఆసరాగా చేసుకుని ఓ వ్యక్తి గ్రామశక్తి బంగారమ్మ గ్రామంపై ఆగ్రహించింది. అందుకే ఈ మరణాలు సంభవిస్తున్నాయని చెప్పడంతో అందరూ పూజలు చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే ఈ మాంత్రికుడు రాత్రుల్లో గ్రామంలోని కన్నెపిల్లలతో పూజలు చేయాలని నమ్మించి వారితో పూజలు చేసినట్లు తెలిసింది. ఇంత జరుగుతున్నా, పంచాయతీ పాలకులు, సచివాలయ సిబ్బంది, పోలీసులకు ఎలాంటి సమాచారం లేకపోవడంతో ఆదివారంతో పూజలు ముగించి బంగారమ్మ మాను వద్ద శాంతి పూజలు చేసినట్లు తెలిసింది. ఇకనైనా అధికారులు, జన విజ్ఞాన వేదిక లాంటి సంస్థలు గ్రామాల్లో అవగాహన కల్పించాలని చుట్టు పక్కల గ్రామస్తులు కోరుతున్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు


అలంకరణలో ముత్యాలమ్మ

చిల్లకూరు: తూర్పుకనుపూరులో వెలసియున్న ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. అమ్మవారికి ఉదయం సుప్రభాతసేవ అనంతరం అభిషేకాలు నిర్వహించిన ఆలయ అర్చకులు అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారి ఆలయ ఆవరణలో భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందిలేకుండా క్యూలో వారికి ఆలయ సిబ్బంది వాటర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఆలయ ఈఓ నవీన్‌కుమార్, ఆలయ చైర్‌పర్సన్ ఇంద్రసేనమ్మ పర్యవేక్షించారు.

మహిళలకు అవగాహన సదస్సు


ర్యాలీలో వాణి, మహిళలు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని గాంధీ పార్కులో ఆదివారం ప్రపంచ బుతుస్రావ దినోత్సవం సందర్భంగా మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళల జీవితంలో బుతుస్రావం సహజ పక్రియ అని, మహిళల పలు అపోహలను తొలగించే విధంగా మిడ్‌లెవర్ హెల్త్ ప్రొవైడర్ వాణి మహిళలకు అవగాహన కల్పించారు. మహిళలకు సంబంధించి ఎటువంటి సమస్యలున్నా వెంటనే పట్టణంలోని అర్బన్ హెల్త్ క్లినిక్‌లతో పాటు ప్రభుత్వ సామాజిక వైద్యకేంద్రంలోని ప్రభుత్వ వైద్యురాలిని సంప్రదించి వైద్య సేవలు అందుకోవాలని సూచించారు. అనంతరం గాంధీ పార్కు నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక మెప్మా అధికారులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆర్పీలు, సిటీ మిషన్ మేనేజర్ పెంచలయ్య, సీఓ ప్రభాకర్ పాల్గొన్నారు.

1న నృసింహునికి చందనాలంకరణ

రాపూరు: పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి మూలమూర్తి జూన్ 1న చందనాలంకరణలో దర్శనమివ్వనున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. ఆరోజు స్వాతినక్షత్రం స్వామివారి జన్మ నక్షత్రం కావడంతో స్వామివారికి ఉదయం 4గంటలకు సుప్రభాతం, 9 గంటలకు శాంతిహోమం, 10గంటలకు కల్యాణం, రాత్రి 7 గంటలకు బంగారు గరుడసేవ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

దక్కిలి: దక్కిలి సచివాలయ పరిధిలో వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కోటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అధికారులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

రేపు వలంటీర్ల వందనం ...

దక్కిలి మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం మంగళవారం ఉదయం 10–30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కోటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపా రు. కార్యక్రమానికి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొంటారని, సేవామిత్ర, సేవారత్నాలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని వలంటీర్లు అందరూ తప్పకుండా హాజరుకావాలని కోరారు.

ఇంజిన్ ఆపి కాలుష్యాన్ని నివారించాలి


వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ సునీల్‌రెడ్డి

గూడూరు: ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వాహన ఇంజిన్లను ఆఫ్ చేసి, కాలుష్యాన్ని నివారించి, ఇంధనం కూడా పొదుపు చేయాలని ఎంవీఐ సునీల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మోటార్ వెహికల్ అధికారులు పట్టణంలోని పలు కూడళ్ల వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్, సంఘం థియేటర్ కూడలి ప్రాంతంతోపాటు, జాతీయ రహదారిపై పలు వాహన చోదకులకు మిషన్ లైఫ్ అనే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల వినియోగంతో పర్యావరణం కాలుష్యకోరల్లో చిక్కుకుంటుందన్నారు. ఈ మేరకు కాలుష్యాన్ని నివారించేందుకు రవాణాశాఖ ఈనెల 27, 28 తేదీల్లో సీనియర్ ఎంవీఐ జగీర్, సునీల్‌రెడ్డి వాహనదారులకు మిషన్ లైఫ్‌పై అవగాహన కల్పించారని తెలిపారు.

పరిమితికి మించి.. ఆపై రాంగ్ రూట్‌లో..


రాంగ్ రూట్‌లో వెళుతున్న ఆటో

గూడూరు: అది నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే జాతీయ రహదారి...అలాంటి రహదారిపై ఓ ఆటో పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్లడమే కాకుండా, ఆపై రాంగ్ రూట్‌లో వెళ్తూ కన్పించింది. ఆటోలో పదిహేను మందికిపైగా ప్రయాణికులతో ప్రయాణించడమే ప్రమాదం అయితే, అలాంటిది ఏకంగా జాతీయ రహదారిపై ఆ ఆటో రాంగ్ రూట్‌లో వెళ్లడం ఇంకెంత ప్రమాదకరమో కదా.. పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై ఇలా ఆటో వెళుతండడం కనిపించింది. తరచూ ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నా నిబంధనల మేరకు వెళ్లాల్సింది పోయి ఇలా నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణం చేయడం ఎంత ప్రమాదమో!

గ్రావెల్ తరలింపు అడ్డగింత

చిల్లకూరు: అక్రమంగా గ్రావెల్‌ను రాత్రి సమయంలో తరలిస్తుండడంతో గ్రామస్తులు టిప్పర్లను అడ్డుకుని పోలీసులకు అప్పగిస్తే వాటిని వదలి వేసినట్లు గ్రామస్తులు ఆదివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. కోట మండలంలోని రాఘవాపురం ప్రాంతంలో ఉన్న పొలాల్లో అక్రమంగా గ్రావెల్‌ను రాత్రి సమయంలో తవ్వి మండలంలోని తొణుకుమాల మీదుగా తరలిస్తుండడాన్ని గుర్తించిన గ్రామస్తులు టిప్పర్లను అడ్డుకున్నారు. దీంతో గ్రామస్తులకు, టిప్పర్ల యజమానులకు మధ్య వివాదం నెలకొంది. దీంతో టిప్పర్లను రెవెన్యూ అధికారుల సహకారంతో పోలీసులకు అప్పగించగా వాటిని ఉదయం పంపివేసినట్లు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి రావల్సిన ఆదాయాన్ని కొంత మంది రాకుండా ఇలా అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారని దీనిపై నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు. టిప్పర్‌ను అప్పగించడంపై పోలీసులను వివరణ కోరగా తమ వద్దకు తీసుకురాలేదని వారు తెలిపారు.

రూ.1.20 కోట్లతో కాలువ ఆధునీకీకరణ


కాంక్రీట్ లైనింగ్ పనులు


కాలువలో పిచ్చి మొక్కలు

–800 ఎకరాలకు తొలగిన సాగునీటి కష్టాలు

పెళ్లకూరు: అహర్నిశలు కష్టపడి సేద్యం చేసే అన్నదాతలు సంతోషంగా ఉండాలనే లక్ష్యం దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనలతో రైతురాజ్యం కోసం సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చొరవతో అధికారులు వ్యవసాయ కాలువ ఆధునికీకరణ పనులు వేగవంతంగా చేయిస్తున్నారు. పుల్లూరు–ముమ్మారెడ్డిగుంట ఏటి కాలువ ఆధునికీకరణ కోసం రూ.1.20 కోట్లతో పనులు వేగవంతంగా చేస్తున్నారు. తెలుగుగంగ ప్రధాన కాలువ నుంచి పుల్లూరు, ముమ్మారెడ్డిగుంట గ్రామాల్లోని చెరువులకు సాగునీరు సరఫరా నిమిత్తం 1.2కిలోమీటర్ల మేర ఏటి కాలువను ఆధునికీకరణ చేస్తున్నారు. ఈకాలువ ద్వారా సాగునీరు సరఫరా చేసి ఇక్కడి పెద్ద చెరువు, చిన్నచెరువుల కింద 800 ఎకరాల సాగు భూములను సస్యశ్యామలం చేసేలా రూ1.20కోట్లతో కాలువ పనులు చేపట్టడం విశేషం.

నిబంధనలు మేరకు పనులు..

రూ1.20కోట్లతో ఏటి కాలువ ఆధునికీకరణ పనులను నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పూర్తిచేసేలా అటు అధికారులు, ఇటు కాంట్రాక్టర్ వేగవంతంగా పనులు చేయిస్తున్నారు. కాలువలో దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు, బురద తొలగించి కాలువకు ఇరువైపులా చదును చేయించారు. అలాగే కాలువ అడుగుభాగంలో సిమెంట్, ఇసుక, కంకర సమపాళ్లలో ఒక అడుగు మందంతో బెడ్ కాంక్రీట్ పటిష్టంగా నిర్మించాలి.

అలాగే కాలువకు ఇరువైపులా 1.2మీటర్ల ఎత్తు కాంక్రీట్ వేయాలి. అదేవిధంగా పుల్లూరు–ముమ్మారెడ్డి గుంట గ్రామాల మధ్య శిథిలావస్థలో ఉన్న వంతెన తొలగించి నూతన వంతెనను పటిష్టంగా ఏర్పాటు చేయాలి.

నాణ్యతా ప్రమాణాలతో..

తెలుగుగంగ ప్రధాన కాలువ నుంచి స్వర్ణముఖినది వరకు వ్యవసాయ కాలువ ఆధునీకరణ పనులను నిబంధనల మేరకు, నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేసేలా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అలాగే అడుగు భాగం 100ఎంఎం కాంక్రీట్ బెడ్ ఒక అడుగు మందంతో పటిష్టంగా ఏర్పాటు చేస్తున్నాం. కాలువ లైనింగ్ పనుల్లో భాగంగా సింగిల్ లైన్ బ్రిడ్జ్ కూడా ఏర్పాటు చేస్తున్నాం.

– రాజేష్, ఇరిగేషన్ ఏఈ, శ్రీకాళహస్తి

సాగునీటికి ఇబ్బందులుండవు..

తెలుగుగంగ జలాలతో పాటు స్వర్ణముఖినది నీళ్ల కాలువకు పుష్కలంగా సరఫరా అవుతాయి. కాలువ ఆధునికీకరణ వల్ల నీరు వృథా కాదు. సాగునీటికి ఇబ్బందులు లేకుండా రైతులందరూ రెండు పంటలు సాగు చేసుకుంటారు.

– రాంబాబు, సర్పంచ్, ముమ్మారెడ్డిగుంట